క్లుప్తంగా

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

వైవీయూ: యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్బనరసయ్య తెలిపారు. గురువారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

27న బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండల పరిధి తాడిగొట్ల సమీపంలోని చిన్నపల్లె యోగిశ్రీ నరసింహ స్వామి 215వ ఆరాధన సందర్భంగా ఈనెల 27న సోమవారం మధ్యాహ్నం బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోసుల మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు.

పాలిసెట్‌కి ఉచిత శిక్షణ

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులంతా 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తమ కళాశాలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యుత్తమ, అసాధారణ ఫ్యాకల్టీతో పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు, కోర్సులు, సీట్ల వివరాలు తెలుసుకోవడానికి తమ కళాశాలలోనే హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పాలిటెక్నిక్ ద్వారా నైపుణ్య సామర్థ్యాలు మెరుగుపడి విద్యార్థులందరికీ పరిశ్రమల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పూర్తి వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని ఆయన అన్నారు.

హుండీ సొమ్ము లెక్కింపు



ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు, ధర్మకర్త

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. దేవదాయశాఖ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్, ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ కమిటీ చైర్మన్ కె.ఉమేష్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన అర్చకులు పిడతల గోపాలకృష్ణ శర్మ, మురళీకృష్ణశర్మ, రఘువీర్‌శర్మ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. గతేడాది జూన్ 7 నుంచి నేటి వరకు హుండీల ద్వారా మొత్తం రూ. 2,02,884 లభించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతిని నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: మహా కవయిత్రి.. రామాయణ తొలి తెలుగు రచయిత్రి మొల్లమాంబ జయంతిని వచ్చే నెల 13వ తేదీ యోగివేమన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించాలని సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కోరారు. ఈ విషయమై గురువారం వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్దనను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రమిచ్చారు. స్పందించిన వీసీ తెలుగుశాఖతో సంప్రదించి జయంతిని విశ్వ విద్యాలయం పక్షాన నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సాహితీ పీఠం మహిళా కార్యదర్శి పార్వతమ్మ, కార్యవర్గ సభ్యులు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల క్రికెట్‌లో చక్కటి అవకాశాలు

కడప స్పోర్ట్స్: మహిళా క్రికెట్‌లో రాణించే క్రీడాకారిణులకు చక్కటి అవకాశాలు ఉన్నాయని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఉమన్ వింగ్ సమన్వయకర్త కె. విష్ణుమోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో స్థానిక వికాస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా క్రికెట్‌లో మెలుకువలు నేర్పించారు. క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెండ్లిమర్రి : స్థానిక పీహెచ్‌సీని గురువారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వల్లి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, మందులను పరిశీలించారు. పీహెచ్‌సీలో క్షయ వ్యాధి కేసులు తక్కువ సంఖ్యలో నమోదయ్యాయని, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి క్షయ వ్యాధి కేసులు మిస్ కాకుండా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

– మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐఓసీఎల్ సంస్థ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. బుధవారం మాక్ డ్రిల్‌లో భాగంగా ఐఓసీఎల్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలతో ఆర్టీసీ వర్క్‌షాప్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐఓసీఎల్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూస్తారన్నారు. దురదృష్టవశాత్తు అనుకోని ప్రమాదం ఎదురైతే దానిని ఎదుర్కొనేందుకు పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం అధికారులు వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ (ఫ్యాక్టరీస్) కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాలుగో డివిజన్‌లోని రాయల్ గార్డెన్, అరుంధతీ నగర్, ఆర్కే నగర్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాయల్ గార్డెన్‌లో నిర్మాణమవుతున్న ఇళ్లకు ప్లాన్ అప్రూవల్స్ ఉన్నాయో లేదో పరిశీలించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అరుంధతి నగర్‌లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. మురికి కాలువల్లో లార్వా ఎక్కువగా ఉండటం గమనించిన కమిషనర్ వెంటనే క్లీన్ చేయించాలని ఆదేశించారు. వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, జ్ఞానం ఉన్నత శిఖరాలకు సోపానాలు

– సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్య, జ్ఞానం ఉన్నత శిఖరాలకు సోపానాలని ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం కడప మున్సిపల్ ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలను ఎంఈఓ పాలెం నారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. అలాగే వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సెక్టోరియల్ అధికారి దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి ఇలియాస్, హెచ్ఎం జావిదాఖానం పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రైస్తవుల పవిత్ర రోజులు

కడప కల్చరల్ : దైవం సూచించిన మార్గంలో ఖచ్చితంగా పయనించే తపస్కాలం ప్రారంభమైంది. బుధవారం నుంచి ఈ పవిత్ర గడియలు, పవిత్రమైన రోజులు ప్రారంభమైనట్లు క్రైస్తవ విశ్వాసులు భావిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు మార్చి 7వ తేది గుడ్‌ఫ్రైడే, ఆ మరుసటి శనివారం వరకు లెంట్ డేస్ (తపస్కాలాన్ని...దుఃఖ దినాలు) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా దానధర్మాలు చేస్తూ విలాసాలకు దూరంగా ఉంటూ నిరంతర ప్రార్థనలతో దేవునికి దగ్గరయ్యేందుకు విశ్వాసులు కృషి చేస్తారు. క్రీస్తును విశ్వసించే వారు ఆయన పాపుల రక్షణ కోసం పడిన కష్టాలను గుర్తు చేసుకోవాలని క్రైస్తవ ప్రముఖులు తెలుపుతున్నారు. ఈ తపస్కాలమంతా జిల్లాలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థన కూడికలు, క్రైస్తవ సేవా సంస్థలు పలు చర్చిలలో వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు, శుభ శుక్రవారం రోజున రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ 40 రోజుల్లో విశ్వాసులు మద్యం, మాంసం జోలికి వెళ్లరు. ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. వీలైనంత వరకు దేవుని ధ్యానంలో గడుపుతారు. ఈ పుణ్యకాలంలో విశ్వాసులంతా ఈ సేవా కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిస్తున్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

– ఆర్‌ఎస్‌వైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కన్నెలూరు శంకర్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రెండో రోజు జిల్లా మహా సభలను కడపలోని ఆర్‌ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 జీఓను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన, మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఇందులో నూతన జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్, కార్యదర్శిగా శివప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శిగా సోయల్, వినయ్, వేంకటేసు, జిల్లా ఉపాధ్యక్షులుగా నాయక్, మురళీ,, మహేష్, కార్తీక్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

– స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప బాలాజీనగర్‌లోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే బావిభారత పౌరులని.. విద్యార్థి దశ నుంచే యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ శ్రీధర్ బాబు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ వీరసుదర్శన్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి

–రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి



కమలాపురంలో శనగలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను అన్ని దశల్లో ఆదుకుంటోందని, ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కమలాపురం మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి సేకరిస్తున్న శనగలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తు నుంచి విక్రయం వరకు అన్ని దశల్లో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు వ్యవసాయం చేయడానికి కావలసినవన్నీ అందిస్తోందన్నారు. అలాగే రైతులు పండించిన దిగుబడులు విక్రయించు కోవడంలో రైతులు నష్టపోకుండా బహిరంగ మార్కెట్ ధర కంటే అధిక ధర వెచ్చించి రైతుల ఉత్పత్తులు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతు భరోసా, ఉచిత ఇన్సూరెన్స్, బీమా అన్ని ఇస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఇప్పటికీ ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులుంటే తక్షణం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే ఈ–క్రాప్ బుకింగ్ తప్పని సరి అన్నారు. కాగా అక్కడున్న రైతులు శనగల కొనుగోలులో కొద్దిమేరకు నిబంధనలు సడలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలకు పంట కిందపడి గింజ నల్లగా మారడంతో 8–10 శాతం నల్లగింజ వచ్చిందని, నిబంధన ప్రకారం 4 శాతం నల్లగింజ ఉంటేనే దిగుబడులు తీసుకుంటున్నారని, మీరే మాకు న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు. దీనికి స్పందించిన ఆయన మార్క్‌ఫెడ్ అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, నాఫెడ్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఒక సారి ఉత్పత్తులు కొనుగోలు చేసి రశీదు ఇస్తే ఆ సరుకు బాగాలేదని వెనక్కు వచ్చినా రైతుకు సంబంధం లేదని, డబ్బులు ఇస్తారని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి వరప్రసాద్‌రెడ్డి, సుబ్బన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్–నాఫెడ్ ఆధ్వర్యంలో బుడ్డ శనగ కనీస మద్దత ధర కల్పిస్తుండటం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుడ్డ శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను చాలా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. రైతులు వారి గ్రామాలలో ఉన్న ఆర్బీకే కేంద్రాలలో శనగల విక్రయానికి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కమలాపురం మండల వైస్ ప్రెసిడెంట్ చెన్నకేశవరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా ట్రెజరర్ దావుద్దీన్, సీపీఎస్ కో కన్వీనర్లు కరీముల్లా, కిరణ్‌కుమార్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు .

25న ఇంటర్వ్యూలు

కడప రూరల్ : 108 అంబులెన్స్ సర్వీసు సెక్షన్‌లో మెకానిక్‌గా పనిచేసేందుకు అభ్యర్థులు కావాలని 108, 104 సర్వీసెస్ డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు ఐటీఐ, డీజిల్ మెకానిక్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఈనెల 25న కడపలోని పాత రిమ్స్‌లోగల 108, 104 సర్వీసెస్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు విద్యార్హత జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని వివరించారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సరికొత్త పరిష్కార మార్గాలు అన్వేషించాలి



ట్రైనర్ కృష్ణభాస్కర్‌ను సన్మానిస్తున్న అధికారులు



హాజరైనవారు

– వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్దన

వైవీయూ: సరికొత్త ఆలోచనలు చేస్తూ పరిష్కార మార్గాలు చూపేవారే ప్రపంచంలో ముందు వరుసలో నిలుస్తారని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య జింకా రంగజనార్దన పేర్కొన్నారు. గురువారం వైవీయూలో కెరీర్ గైడెన్స్ సెల్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాపును వీసీ ప్రారంభించి మాట్లాడారు. మనం ఎక్కడి నుంచి వచ్చాం.. కుటుంబ నేపథ్యం ఏంటి అనే ఆలోచనలు విడనాడి, ఏదైనా సాధించాలనే లక్ష్యంతో సాధన చేసి గమ్యం చేరుకోవాలన్నారు. విషయ పరిజ్ఞానంతో పాటు ఇంటర్వ్యూ బోర్డులో ప్రదర్శించాల్సిన నైపుణ్యాలకు సంబంధించిన అవగాహన అవసరమన్నారు. ప్రభావవంతమైన ఆలోచనలతో భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మేధోపరమైన ఆలోచనలు జీవిత ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. జేసీఐ ఇంటర్నేషనల్ ట్రైనర్ కె. కృష్ణభాస్కర్ మాట్లాడుతూ వక్తగా తయారుకావడానికి ఆకట్టుకునే వ్యక్తిత్వం, హావభావాలు, విషయ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ ఈ నాలుగు అంశాలు ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. వాటిని పాటించాల్సిన విధానాలను వివరించారు. ముగింపు సమావేశానికి వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ విచ్చేసి శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మరో ట్రైనర్ డా. నూరిపాష, వర్క్‌షాపు కన్వీనర్ డా. కె. లలిత, డా. పి. సరిత, డా. వేపరాల లాజర్, డా. ఎస్.వి.సుబ్బారెడ్డి, డా. రెడ్డయ్య, డా. సునీత, డా. రవీంద్ర, డా. లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి తెలుగుదేశం పార్టీ కుట్రలు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆరోపించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గన్నవరంలో గొడవలు సృష్టించేందుకు చంద్రబాబు పథకం రచిస్తే పట్టాభి దాన్ని అమలు చేశారన్నారు. ఏదో విధంగా రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం సృష్టించి ఆ నెపం ప్రభుత్వంపై వేయాలనే ఆలోచనలో టీడీపీ నేతలు ఉన్నారని మండిపడ్డారు. పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా ఎల్లో మీడియాలో కొట్టినట్లు కథనాలు రాయించి సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రచార పిచ్చి వల్ల జనం ప్రాణాలు పోయినా వారికి లెక్కలేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ నాయకుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఎవరూ మర్చిపోలేదన్నారు. చంద్రబాబు, లోకేష్ చట్టాలకు అతీతులేమీ కాదని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి కుటుంబ సభ్యులపై బురదజల్లేలా దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

పండ్లు పంపిణీ



మానసిక చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న పండ్ల వ్యాపారులు

కడప కల్చరల్: కడప నగరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో గురువారం నగరానికి చెందిన తోపుడు బండ్ల వ్యాపారులు చిన్నారులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు. వ్యాపారులు రాము, మగ్బుల్, పెద్ద రాము, మస్తాన్ తదితర పండ్ల వ్యాపారులు తాము విక్రయించే ద్రాక్ష, ఆపిల్, జామ, అరటిపండ్లను స్థానిక నాయకులు ఆర్.బాబు, నాగిరెడ్డి, జోకుల సుబ్బరాయుడు సహకారంతో పంపిణీ చేశారు. అల్‌షిఫా వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుశాఖ ప్రధాన లక్ష్యమని కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత గంజాయి, పాన్ పరాగ్, గుట్కా, పొగాకు, మాదక ద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళా పోలీసులు వాసవి, నాగ సురేఖ, రామ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వెంటనే మొదలు పెట్టండి

డ్వామా పీడీ యధుభూషన్‌రెడ్డి



సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ యదుభూషన్‌రెడ్డి

చాపాడు : వ్యవసాయ పనులు ముగిశాయని వెంటనే ఉపాధి కూలీల కోసం పనులు మొదలు పెట్టాలని ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.8.19కోట్ల ఉపాధి పనులు జరిగాయి. ఇటీవల పనులపై జరిగిన సామాజిక తనిఖీ అనంతరం గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకంలో కూలీల ద్వారా రూ.4.68 కోట్లు, మెటీరియల్ ద్వారా రూ.3.51 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉపాధి పనులతో పాటు పంచాయతీరాజ్ అనుసంధానంతో జరిగిన పనులలో రూ.9,94,830లకు సరైన రికార్డులు లేవని తనిఖీ సభ్యులు గుర్తించారని రికవరికీ ఆదేశించారు.ఏప్రిల్ నుంచి మండలంలోని చెరువులను అమృత్ సరోవర్ కింద అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు ఇళ్లను మొదలుపెట్టని వారికి, మొదలుపెట్టి రెండు దాటిని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో చాపాడు మండలం ముందంజలో ఉందన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటికి బిల్లులు విడతలవారీగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఉపాధి ఏపీఓ పద్మారాణి, పంచాయతీరాజ్ ఏఈ ఈశ్వరయ్య, హౌసింగ్ ఏఈ మహబూబ్ బాషా, ఏపీడీ శ్రీలక్ష్మి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయభాస్కర్, ఏఈఈ సుధాకర్, ఉపాధి ఈసీ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్లోకి కొత్త యాక్టివా వాహనం

ప్రొద్దుటూరు క్రైం : హోండా కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన యాక్టీవా హెచ్ స్మార్ట్ వాహనాన్ని గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. ప్రొద్దుటూరులోని మైదుకూరు రోడ్డులో ఉన్న యంఆర్ హోండా షోరూంలో మేనేజింగ్ డైరెక్టర్ ముమ్మిరెడ్డి మహేందర్‌రెడ్డి నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. మొదటి కస్టమర్ ఎస్ఎస్ ఫయాజ్‌అహ్మద్‌కు యాక్టివా స్మార్ట్ కీని అందచేశారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, జీఎం సందీప్‌కుమార్, ఏజీఎం షేక్‌షావలి, ఎస్ఎం గోపినాథ్‌రెడ్డి, షోరూం సిబ్బంది, ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

26న మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ

ప్రొద్దుటూరు : ఈనెల 26న ఉదయం 10 గంటలకు తెలుగు అధ్యాపకులు డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు మిత్రజ్యోతి సాహితీ సాంస్కృతి సంస్థ, విరసం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ప్రకటించారు. గురువారం వారు సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహించే సభలో ఆస్మానీ, సిక్స్‌ప్యాక్ రాముడు, రెయిన్‌బో కథల పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారని వారు పేర్కొన్నారు. సాహితీ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగ యువతులకు సాఫ్ట్‌వేర్ కోడింగ్‌పై శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: నవ్ గురుకుల్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోడింగ్‌పై నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 ఏళ్లలోపు కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఏడాది కాలం పాటు బెంగుళూరులో శిక్షణ ఇస్తామని వివరించారు. వివరాలకు 9000487423 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు కలశ శిఖర ప్రతిష్ఠ

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం కలశ శిఖర ప్రతిష్ట, నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి ఊరేగింపు ఉంటుందని వివరించారు.